డొక్కా సీతమ్మ

[తూర్పు గోదావరిజిల్లా రాజోలు తాలూకా లంకల గన్నవరంలో ఈమె నిరతాన్నప్రదాత్రిగా వుండినది. ఈ రేడియో నాటక కారుడికి ఈమె భర్త నామము జోగయ్య అనే విషయంకూడా తెలియనట్లుంది. ఈమె మరణించి ఇప్పటికి ముప్ఫయి లేక నలభై ఏళ్లు కావచ్చు. ఈమె అన్నదాననిరతిని గురించి గోదావరి జిల్లాలలో ఇప్పటికిని అనేకకథలు విశేషప్రచారంలో వున్నాయి. —సంపాదకుడు.]

—బైరాగులు దోవవెంట పోతూ—

(గేయం)

ఎన్ని దానాలైన అన్నదానంబౌన
ఇన్నినిష్ఠలు, జపా లెందుకో గురుడ!
పట్టెడన్నము పెట్టి బ్రతికించు సీతమ్మ
అట్టి తల్లికి సాటి యగువార గురుడో.
రాజులంతా పోతరాజులా తింటారు
రోజంతసాధులూ రోదింత్రు గురుడా
డొక్కవారిలా వన్నె కెక్కినా సీతమ్మ
ఒక్కతే మనకెల్ల—దిక్కురా గురుడో.

బంట్రోతు—తాణేదారుగారు పేర్రాజుగారు దొరగారి శలవైంది.

పేర్రా—శలవైందా, ఇదుగో యిప్పుడే వస్తున్నానని మనవి చెయ్యి.

... ...

జమీం—పేర్రాజుగారు, ఏవిటండి ఆ గోసాయిలు పాడుతారు, ఎవరండీ, ఆసీతమ్మగారు. మా గొప్పగా పాడేస్తున్నారు. సత్రాలు, సావిళ్లు కట్టించిన వాళ్లం, దొరలం మేమంతా ఊరికెనే పోయినాంగాని ఈ సీతమ్మగారో కావిడ వచ్చింది గొప్ప అన్నదానంచేసేదని పొగడటానికి?

పేర్రా—చిత్తం—అదే విధి! అదుగో, అదుగో ఆ వీధిలో భట్రాజు ఒకడు వెళుతున్నాడు. శలవైతే పిలుస్తాను. డొక్క సీతమ్మగారిమీద పద్యం చదువు అనండి.

జమీం—పిలు, పిలు, వీందాం.

పేర్రా—అదుగో వస్తున్నాడండి.

భట్రాజు— చిత్తం, ప్రభువులు, మహారాజులు- అర్థిజనకుముద బాంధవా, ఆశ్రితవిద్వజ్జనాధారా! రాయనమంత్రిభాస్కరా...

జమీ—ఆగవోయ్, ఆగు...

భట్రా—చిత్తం...

జమీ—ఆ డొక్కా సీతమ్మగారిమీద ఏదో పద్యముందిట— ఏదీ చదువు... నువ్వే వ్రాశావా?

భట్రా—చిత్తం మహాప్రభో!— (రాగంవలె మూలిగి)

కం. డొక్కా సీతమ యంటె [గా
నిక్కాను గా అన్నపూర్ణనిజమురయం
ఎక్కడి దధి, ఘృత, సూపము [మా
లెక్కడిభక్ష్యాలు చెప్ప నెవ్వరి తర

జమీం— ఇతని కేదన్నా యిచ్చి పంపించమని కచ్చేరీకి చెప్పు.

భట్రా—మహాప్రభో, యింకా ఈ తల్లి కథలు చాల వున్నయండీ, ఒకానొకనాడు—

జమీం—పేర్రాజూ! వెళ్ళమని చెప్పు.

పేర్రా—(నెమ్మదిగా) వెళ్లు. వెళ్లు. —దొరగారి శలవైంది.

జమీం—ఏమిటో వేలం వెర్రి.

పేర్రా—చిత్తం, తమరు అలా శలవిస్తే—ఏం చెపుతాను! నేనూ చాలామందిని చూస్తున్నాను. డొక్కా సీతమ్మగారున్నారేండి, ఆ మహాతల్లి అన్నపూర్ణాదేవే అంటారు. ఓరాత్రిలేదు, పగల్లేదు, అతిథి, అభ్యాగతీ ఎవరు వెళ్ళినాసరే, ఆ త్తబంధువుల్లాగు చూసుకొని, పద్రసోపేతంగా, మృష్టాన్నం పెడుతుంది.

జమీ౦—అసలు, నీవు కాస్త వుంటె గంపంత చేస్తావు.

పేర్రా—కాదు, ప్రభూ! తాము నిజం చిత్తగిస్తే—

జమీ౦—పోనియ్యి, ఎప్పుడన్నా, ఎవరన్నా వస్తే, పట్టెడన్నం పెడుతుందేమో. అసలు బ్రాహ్మణులూ, మూళ్ళాపూ, తిన టానికి పారేయ్యటానికి సరిపో య్యేట్టు వండుకుంటారటలే, ఆ వేళకు ఎవరన్నా వస్తే పార వెయ్యకుండా, వచ్చినవాండ్లకు పెట్టిందేమో... అంతమాత్రం చాత...

పేర్రా—స్వయంగా నేను చూశాను, చిత్తం...

జమీ౦—నీవు వెళ్ళిన్నాడు ఏదో పండుగై వుంటుంది, బాగా మేపిందేమో! ఓః నువ్వు ఆమెను తీసుకువెళ్ళి నక్షత్రాల్లో నడిపిస్తున్నావు.

పేర్రా—తమదాకా ఆ ప్రశంస రాలేదుగాని, ఎప్పుడూ, డొక్కా సీతమ్మగారంటె చాలా ప్రశస్తి, చిత్తం. మొదట వాళ్ళది మంచి సంసారమే. ముప్ఫై ఎకరాలు గోదావరి కాలవ క్రింద సుక్షేత్రమైన మాగాణీ, రెండు కొబ్బరి తోటలు, మన ఎస్టేటులో వూరే అది. తమరు ఎప్పుడూ దయచేయ లేదు అవూరు.

జమీ౦—ఒక్క బ్రాహ్మలకేనా, పేర్రాజు?

పేర్రా—అలాకాదండి, ఎవరైనా సరె. ఈకులం, ఆకులం అని విచక్షణేలేదు అతల్లికి, క్షుద్రాత్రుడై వచ్చాడంటె సరి, అన్నం పెట్టేదాకా ఆమె ప్రాణం నిలవదంటె నమ్మండి. అదేవిటో ...... కేవలం ఇందుకే వాళ్ల ఆస్తి, ఆ కొబ్బరితోటలూ, అన్నీ అప్పులకింద అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా బాధ పడిపోతున్నారు పాపం, ఇంట్లో —అయితేమాత్రం, నాస్తి వున్నదా, హరిహరీ మాంగల్యాన్ని కుదువబెట్టయినా సరె ఆ వచ్చినవారి ఆకలిమంట చల్లారుస్తుంది గాని ఆతల్లి— జగన్మాత.

జమీ౦—నువ్వింతగా చెబుతూంటె నిజమేమో అనిపిస్తూంది. ఐనా పరీక్షించి చూస్తేగాని నేను నమ్మను. వాళ్ళకేం దొరతనాలున్నాయంటావా?

పేర్రా—చిత్తం, చిత్తం. ఏదో పరువుకోసం, నలుగురు ఓహో అని పొగడటంకోసం చేసేమనిషైతే పరీక్షిస్తే పడిపోతుంది. ఆమెకేం— ఆమెది మాతృహృదయం. ఆకలి అమ్మా, అని వింటె ఆమె ప్రాణం, కోసుకుపోదూ?

జమీ౦—సరేగాని, యిలా యిల్లంతా గుల్లచేస్తుంటె ఆమె భర్త చూస్తూ ఊరుకుంటున్నాడూ?

పేర్రా—ఆయన అంతవాడు కాదులెండి. తెలివి కలవాడే— ఏంచేస్తాడు! భార్య చేసేది సత్కార్యం.

జమీ౦— ఏం భార్య — ఏం సత్కార్యం— కొంప కొలుపోలా? ఇప్పుడేం చేస్తారూ.

పేర్రా—ఆమె కా దిగులు లేదండి. అంతా పరమేశ్వరుడే యిస్తాడు, ఇదేం నాయింట్లో పూ? అని ఆమె ఎప్పుడూ మహారాజపత్ని కున్నంత సంతృప్తితో వుంటుంది.

జమీ౦—ఇదెంతవరకు నిజమో, నేను బాగా విచారించుకొని గాని చెప్పను. నిజమే ఐతేమాత్రం పాపం సర్వం కోలుపోయినవాళ్ళకి, ఒక వూరు వ్రాసి యిచ్చి నిరతాన్నదానం చేసే ఏర్పాటు చేస్తాను.

పేర్రా—చిత్తం. ప్రభువు తలుచుకుంటే ఏం కొదవ?

[సీతమ్మగారు, ఆమె భర్త—రాత్రి ౯ గంటలు. వంటిల్లు సర్దుకుంటున్నట్టు చెంబులు, పీటలు చప్పుడు. తలుపు వేసింది-]

భర్త—ఇదుగో

సీత—...

భర్త—అమ్మీ...

సీత—ఏవిటి?

భర్త—అన్నం తినకుండా నేవచ్చావా, చివరికి? ఎందుకు తింటావు- మొదటినుంచి ఇదేగా మనకు, నే నౌనంటే నీవు కాదంటూ వుండడం.

అమృతాంజనము



ఎవ్వడవీవు కాళ్లు మొగమెఱ్ఱన? హంసము; యెందునుందువో?
దవ్వుల మానసంబునను; దానవిశేషము లేమి తెల్పుమా?
మవ్వపుఁ గాంచనాబ్జములు మౌక్తికముల్ గలవందు; నత్తలో?
యవ్వి యెఱుంగ మన్న, నహహాయని నవ్వె బకంబులన్నియున్.

అన్నినొప్పులకు దివ్యామృతము

సీత—పోనీ లెద్దురూ, ... ఒక్క నాటికేం ప్రాణాలుపోతాయా?

భర్త—అది కాదు, ఉండగా తినకపోవటమెందుకు • అని.

సీత— ఎవరన్నా, అపరాత్రివేళ వస్తారనుకోండి. వస్తే, అప్పుడేం చేస్తారు? జోరున ఈ ముసురు వొకటి. ఈ దరలో, మీరు పెద్దవారు, ఎక్కడికి వెళుతారు, ఎవరిస్తారు, చెప్పండి!

భర్త—ఈ రాత్రి ఎవడొస్తాడే తలకుమాసినవాడు. మనం మహాసత్రం పెట్టామని.

సీత—అలాకాదు. పరీక్షగా తటస్థపడుతారు. ఇలాంటప్పుడే, మనమేం లోకాన్నుద్ధరిస్తున్నామూ? పట్టెడు మెతుకులు, అంతేగా.

భర్త—అల్లాగే వుంటుంది మొదట్లో, ఒక్క సెంటు భూమి కూడా లేకుండా అంతా అప్పుల వాళ్లు కట్టుకొని పోయినారా? చూస్తూ వుండగా మనమేం చేశామని పెళ్లిళ్లా, ప్రస్తావాలా? అంతా ఈ భోజనాల కిందేగా అంతరించిపోయింది, తోటలూ, దొడ్లూ, సర్వమూ—ఇహ కొంప ఒకటి మిగిలివుంది, సూర్యచంద్రాదులూ మనం కలిసి కాపరం చెయ్యటానికి.

సీత—మనం యివన్నీ వచ్చేటప్పుడు మూటగట్టుకు తెచ్చామటండి, పోయేనాడూ అంతే, ఒక్కటీ వెంటరాదు. ఏదో ఆ భగవంతుడే ఇస్తూ ఉంటాడు ఆ వేళకి.

భర్త—మనింటికి వచ్చేవాళ్ళకు మాత్రం ఆ భగవంతుడు లేడూ— ఆడవాళ్ళకి పట్టిందా ఒక్కటే వేదాంతం – లేదా, అరిచి చచ్చినా చేయి విదల్చరు

కాకికైనా. అంత కేవలం వేదాంతంలో కూచుంటె జరుగుతుందా? యీ కాలంలో, సరేగాని, లోపలికి వెళ్ళి నాలుగు మెతుకులు తింటు మరేం పొద్దు పోలేదు.

సీత—వద్దులెండి, పడుకోండి.

భర్త—అంటె, తినవన్నమాట. తెల్లవారితే, ఏదో అఘోరించి, ఎవడి కాళ్ళయినా పట్టుకుని– చివరకీ కొంప ఒకటేగా మిగిలింది. దీన్నికూడా తాకట్టుపెట్టి, కావలసిన దధిఘృత పాయసాలు, బండ్లకెత్తించుకుని వస్తాను. సరేనా? నీవు స్వర్గానికి పోతానంటె, నేనేనా అంత పాపిష్ఠి పరమయ్యాని.

సీత—నామాట వినండి. ఏదో ఎవరి పిచ్చి వారి కానందం, మీరు వెళ్ళి పడుకోండి, నాకేం ఫరవాలేదు.

భర్త—నీ ఖర్మం...అనుభవించు.

సీత—ఈయన పడుకున్నారు. ఆ పరమేశ్వరుడే యిస్తాడనే నమ్మకం కుదరక, ఊరికే ఆందోళన పడతారు ఈయన. చేసేదేముంది? ఔను, తెచ్చే మగవాళ్ళ బాధ అంతేనేమో ... ...రామచంద్రప్రభూ! రక్షకా! నీదయ. మంది అనేదంతా సమర్పించుకున్నాం, అతిథిని పంపించేవాడివి, ఆహారమందించేవాడివి అంతా నీవేకదా ...–(ఆవలించి నిద్రిస్తుంది)–

(గోవిందనామాల పాట)

ఆరామలక్ష్మణులు గోవిందారామ,
అడవిల్లో కేగిరి గోవిందా
సీతమ్మ తల్లితో గోవిందారామ-
చిత్రకూటమువద్ద గోవిందా
పర్ణశాలను గట్టి గోవిందారామ
బాగుగా నుండిరి గోవిందా ॥

[రాత్రి వానకు గోదావరీ ప్రవాహపు నీటి కరుళ్ళు ఒడ్డులకు తగిలేశబ్దం, రుయి మనే యీదరగాలి సీతమ్మగారి యింటిరేలుపులు ఊపుతుంది.]

సీత—నిద్ర పట్టలా, పాపం- ఏమండోయి!—నిద్రపోతున్నారా?

భర్త—అబ్బా, ఏమిటే...

సీత—వినండీ ఏమిటీ చప్పుడు?

భర్త—గాలికేమో, తలుపులు కొట్టుకుని వుంటయి.

[హోరుగాలి వినపడుతుంది.]

అబ్బా, కిటికీ మూసేయి, వాన జల్లు లోపలికి కొట్టుతూంది, అమ్మయ్యో ఏం వురుములు, ఏం మెరుపులు.

సీత—

రామనామ తారకం జానకీమనోహరం
భక్తిముక్తి దాయకం సర్వలోకరక్షకం

భర్త—పడుకోవే, నీభక్తి బంగారంగాను. రెండు ఘంటలైంది, కూచున్నావు శివశక్తిలాగు.

సీత—ఏమిటీ పడక, హోరుగాలిలో నిద్ద రేం పడుతుంది!

—దూరాన్నుంచి, సీతమ్మగారూ, ఆకలేస్తూంది, అన్నం పెట్టండి సీతమ్మగారోయ్.—

సీత—ఏమండోయ్ లెండి, ఎవరికో ఆకలి వేస్తున్నదట పాపం.

భర్త—చాలు చాల్లే ఊరుకో, ఏమాలవాడో, మాదిగ వెధవో. అర్ధరాత్రీ ఆకలేస్తే రోకలి మింగమన్నారు.

సీత—అల్లా కాదండీ, ఎంత ఆకలేసిందో అర్ధరాత్రివేళ, నేను చెప్పలా యిలాగే ఎవరైనా వస్తారని. నేను తినేస్తే, యేమయ్యేదో సుమండీ.

గోదావరి అవతల ఒడ్డునున్నానమ్మా తల్లీ.

సీత—ఆగండి... అదుగో గోదావరి అవతల ఒడ్డునున్నాట్టండి. ఆ పక్షుకు మెతుకులు పెట్టి వస్తానండి.

భర్త—నీకేం మతి గితీ పోయిందా. అర్ధరాత్రి. తాడిపోత వర్షం, గాలి హోరుమంటోంది. ఇప్పుడు గోదావరి దాటి వాడికి అన్నంపెట్టి వస్తావు, మహబాగా వుంది.

—ప్రాణాలు పోతున్నయి తల్లీ—
సీతమ్మతల్లీ—ఆకలేస్తుందమ్మా—

సీత—అయ్యయ్యయ్యో నాప్రాణం వూరుకోలేదండీ. ఎంత ఆకలేస్తుందో అదుగో వర్షం వెలిసింది. నేను వెళ్ళి పెట్టివస్తాను.

భర్త—వెళ్ళబోకే అఘాయిత్యం. పాడుబడ. తెల్లవారే లోపల చచ్చిపోళ్ళేవే.

సీత—అట్లా కాదండి. ఆ కేకలో ఎంత దీనత్వం, ఎంత బాధ

వినిపిస్తూందండి. వెళ్ళకపోతే నాచేతిమీదుగా అతని ప్రాణం తీసినదాన్నౌతాను.

భర్త—ఏం, పోతే, పోతాడు - భూమికి వెలితా ?

సీత—అబ్బా, ఎంత మాటన్నారు, ఊరుకోండి, అవాచ్యం.

భర్త—అదెందు కూరుకుంటుంది. మాట్లాడుతూనే వుంది. అప్పుడే మూటగట్టింది అన్నం. అర్థరాత్రి పురుగుబుట్ర వుంటయి కూడా.

సీత—నన్నిహ మాట్లాడించబోకండి, ఆమనిషికి అన్నం పెట్టేవరకూ నామతి మతిలో వుండదు.

భర్త— వెడుతున్నావు - అమ్మయ్యో, అమ్మయ్యో, మళ్ళీ వాన మూసుకువస్తున్నది. గొడుగైనా తెస్తానుండవే. నిన్నే నేవ్ - లాంతరట్టుకొస్తున్నానుండూ ఏమేవ్, వస్తున్నా ...వినిపించుకోదేం... అయ్యయ్యో సందు మలుపు తిరిగింది ...ఇదుగోనే, లాంతరూ గొడుగూనూ- అయ్యయ్యో ఎంత చీకటి...కన్ను పొడుచుకున్నా కనపట్టంలేదు. గోదావరి గట్టు నిండా త్రాచుపాములు...ఎవరయ్యా మీరు. ఇలా రండి కొంచెం. కాణేదారుగారా, బాబు. కాస్త తోడు రండి. మాయింటావిడ అల్లా వెళ్ళిపోతూందండి.

పేర్రా—కర్ర చేతులో వుందా, పాములుంటయి.

భర్త—అదుగదుగదుగో, చూశారు. ఆ గోదావరి ఒడ్డు, ఆతుమ్మ చెట్లల్లో కదుల్తూ వుంది. చూడండి, వెళ్దాం, తొందరగా వెళ్దాం, పేర్రాజుబాబు, ఆ మనిషి చెపితే వినదు, ఎవడికో ఆకలేసిందిట. ఆమట్టున లేచి పరుగెత్తుతూందండి.

పేర్రా—అదేవిటండి, గోదావరిలో దిగబోతున్నారుకూడాను. ఎంత మహాతల్లండి సీతమ్మగారు.

భర్త—పేర్రాజుబాబూ, అది మొసళ్ళ గుండం కూడానూ, మాయింటిది ఇహ నాకు దక్కదు. ఈ అర్థరాత్రి గోదావరి ఈదుకువెళ్ళి ఆ మాలవాడికి అన్నం పెట్టకపోతే యేం మునిగిపోయింది బాబు- (ఏడుస్తూ)-

పేర్రా—ఉండవయ్యా పిచ్చిబ్రాహ్మడా, ఆ సీతమ్మతల్లి కడుపు చల్లగాను. ఎంతమంది ప్రాణాలు రక్షించిందో.

భర్త—ఏమేవ్, బాబోయ్, బాబోయ్ ఆగుండంవేపే వెళ్తూందండి, సుడిగుండం అక్కడ తాడిలోతు బాబూ.

పేర్రా—ఓ సీతమ్మగారూ.

భర్త—ఏమేవ్, ఆ పక్కకు వెళ్ళకు, మొసళ్లు, మొసళ్లుంటాయి. (చప్పట్లు చరుస్తాడు)

పేర్రాజుబాబూ! అదుగో మునుగుతోందండి.

పేర్రా—పరోపకారం కోసం ప్రాణాలర్పిస్తోంది మహాతల్లి.

భర్త—పరోపకారమేమిటయ్యా, నా కాపరం బండలైపోయింది. అయ్యయ్యయ్యో.

పేర్రా—అదుగోనయ్యా తేలింది, పోయినకొద్దీ గోదావరి నడుములోతే వుంటుంది ఆమెకు, ఆహా...

భర్త—బాబూ, తేలిందా బాబూ, నా సంసారం తేల్చిందన్నమాటే-

పేర్రా—ఆహాహా, ఆ శ్రీకృష్ణపరమాత్మవారిని, వసుదేవుల వారు తీసుకుపోతూంటే యమునాదేవి ఇలాగే యిచ్చిందిట దారి. చూడవయ్యా వెర్రి బ్రాహ్మడా మహా పతివ్రత, పరమ భక్తురాలు.

భర్త—అదుగో బాబు వడ్డెక్కిన ట్టుందే. ఆ, అది గట్టెక్కితే, మాకష్టాలు గట్టెక్కినట్టే.

[గోదావరి ఒడ్డున చింతచెట్టుకింద ఒక మనిషి మూలుగుతూ ఉంటాడు-]

సీత—ఎక్కడ నాయినా! నా ఖర్మం కాలి కంటికి కొంచెం మసకలు కూడాను. యిక్కడేనా, తండ్రీ!

వ్యక్తి—(మూలుగుతూ) అమ్మా, సీత...మ్మ...తల్లీ, ఇంకా రాలేదా తల్లీ, ఆకలితో చివరకు

చావాలసి వచ్చింది అమ్మా.

సీత—ఇదుగో వచ్చా నాయనా! నాతండ్రీ! వచ్చా. పులుసైపోయింది. కొంచెం గోంగూర పచ్చడి, అన్నమూ, పెరుగు చుక్కా పట్టుకొచ్చా.

వ్యక్తి—ఊఁ...ఊఁ... ఏదైనా సరే తల్లీ!...ప్రాణాలు తక్కితే...

సీత—ఆ దిక్కుమాలిన గొల్లది నెయ్యి పట్టుకురమ్మంటే పట్టుకొచ్చిందే కాదు. నెయ్యి లేదు బాబు. ఎలా తింటావోఏమో, ఇంటిదగ్గరైతే కాసిని పాల చుక్కపోద్దును.

వ్యక్తి—దగ్గరకు రాకు తల్లీ, ఆ మాట అక్కడ పెట్టమ్మా, నేను మాలవాణ్ణి.

సీత—ఆకలికి కులమేమిటి నాయనా? యింటికెళ్ళి ఎలాగు స్నానం చేస్తానుగా. ఇదిగో ముద్దలు కలిపాను, తిను నాయనా. గొంతిక పడుతుందేమో, అరిచి, అరిచి వున్నావు. తిను నెమ్మదిగా,...నా ఖర్మం కాలిపోను. చెంబు మరచి వచ్చా...ఎట్లా...దోసిలితో తెచ్చి పోస్తాలే నాయినా... యిక్కడేగా నీళ్లు...తాగు.

వ్యక్తి—హమ్మయ్యా... యిప్పటికి ప్రాణాలు నిలిచాయి తల్లీ ...ఎంత రుచిగా ఉన్నాయి పదార్థాలు తల్లీ...

సీత—నాయనా, తూర్పు రేఖలాడుతున్నయ్...అప్పుడే.కొంచెము యీ చెట్టుకింద కూర్చుని మరీ వెళ్లు. ఆ బట్టలేవి, యిటు తే, పిడిచి ఆరవేసి పోతాను. నేను వెళ్ళి వంటచేయాలె పెందరాండే, ఏనాతండ్రి ఆకలంటూ వస్తాడో బాబు, ఆకలి అంటె నా పేగులు తరుక్కు పోతయి బాబు. అదే పిటో కడుపులో చెప్పరానంత బాధగా వుంటుంది. పిడికెడు మెతుకులు పెట్టానా, ఆ బాధ చేత్తో తీసివేసినట్టే పోతుంది.

వ్యక్తి—(సీతమ్మగారి రెండు కాళ్లు పట్టుకుంటాడు) అమ్మా, సీతమ్మతల్లీ...

సీత—ఇదేమిటి నాయనా, నా పాదాలు పట్టుకుంటావు, ఏమంత పెద్ద వుపకారం చేశాననీ? ఆకలైతే అన్నంపెట్టాను ఇంతేనా, నా పిల్లల కాకలైతే పెట్టుకోనూ విడిచిపెట్టు - పాదాలు విడిచిపెట్టు నాయనా...

వ్యక్తి—అమ్మా యీ పరగణాకు నేను జమీందారుని...

సీత—అయ్యో, అయ్యో, రెడ్డి ప్రభువులా తండ్రీ?

వ్యక్తి—తల్లీ, అపచారం చేశాను, నీ అన్నదానాన్ని గురించి లోకమంతా చెప్పుకుంటున్నా, అనుమానించి, పరీక్షింతామని వచ్చాను. క్షమించు, చాలా శ్రమ పెట్టాను. మీరు తరతరాలవరకు ఇలాగే అన్నప్రదానం చేసేందుకు డొక్కా సీతమ్మగారి అగ్రహారం అనే పేరుతో యీవూరు ఇచ్చేస్తున్నాను. నీవు సాక్షాత్తు అన్నపూర్ణాదేవివి. నీవంటి జగన్మాతలు నా పరగణాలో ఉండబట్టే పరగణా అంతా సుభిక్షంగా వుంది.

సీత—నాయనా, మాకెందుకు అగ్రహారాలు. వాడిచ్చింది, వాడికే పెడుతున్నాం. దీన్నికూడా ఆ ఏలినవాడికే అర్పిస్తాను.

వ్యక్తి—మహారాజులని బిరుదులు పెట్టుకున్నవారెందుకు తల్లీ! నీవంటి లోకమాత ఒక్కత్తుంటే చాలదూ, ఆకలిమంట చల్లార్చటానికి? అదిగో, దాసుడు ఏం పాడుకుంటున్నాడో వినమ్మా...విను.

—(మారాన్న దాసరి పాడుతుంటాడు.)—

సీతమ్మ తల్లికి-చేయెత్తి మ్రొక్కుము
అతల్లి సాక్షాత్తు అన్నపూర్ణ,

ఆకలమ్మ అన్నమంటె
ఏకులమువారైనగాని
సకలభక్ష్య భోజ్యములతో
సాకి రక్షించుతల్లి॥ సీతమ్మ॥

—ఆల్ ఇండియా రేడియో.

1942వ సంవత్సరంలో ఆంధ్రభూమి మాస పత్రికలో ప్రచురించబడ్డ వ్యాసం ఇక్కడ చూడవచ్చు. ఇలాటి ఆణిముత్యాలు ఎన్నో ఎన్నెన్నో చదువరులకు అందుబాటులోకి తెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలతో

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

విడివిడిగా ఉన్న ఈ ఆణిముత్యాలు ఒక పి.డిఎఫ్ గా మార్చి మరింతమందికి అందుబాటులోకి తీసుకుని రావటమే తప్ప కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసం ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు
మాగంటి వంశీ మోహన్